క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో దాసరి పైడితల్లమ్మ పండగ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో కొలువైయున్న దాసరి పైడితల్లమ్మ పండగ మహోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జామునే భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను సమర్పించారు. కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నగర సంఘం డైరెక్టర్ గుర్రం రాజేష్, మాజీ కౌన్సిలర్ ఈటి శ్యామలరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

ఘనంగా బంగారు తల్లి పండగ

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు అంబేడ్కర్ కాలనీలోని బంగారు తల్లి అమ్మవారి పండగను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులకు సర్టిఫికెట్లు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో కరజాడ కృష్ణ, కోట నాయుడు, శ్రీదేవి, రామకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న యువశ్రీ

అక్కిరెడ్డిపాలెం: కారు ప్రమాదంలో గాయపడి, కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను షీలానగర్‌కు చెందిన రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ మంగళవారం పరామర్శించారు. ఈ నెల 11వ తేదీన రాత్రి సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్‌రోడ్డులో కారు అదుపు తప్పి లోయలోకి దూసుకువెళ్లిన ఘటనలో గాజువాకకు చెందిన మధు, భాస్కర్, శివ, భాస్కరరాజు, సత్తిబాబు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వారిని పరామర్శించిన యువశ్రీ, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కేజీహెచ్ వైద్యులు డాక్టర్ నవీన్, డాక్టర్ అరుణలను కోరారు.

కేజీహెచ్‌కు అనాథ శవం తరలింపు



మృతదేహాన్ని తరలిస్తున్న శాంతిరథం

గాజువాక : గాజువాక లంకా మైదానంలో గుర్తించిన 60 ఏళ్ల వయసు గల అనాథ వ్యక్తి మృతదేహాన్ని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కేజీహెచ్‌కు తరలించారు. గాజువాక ఎస్‌ఐ కొల్లి సతీష్ సూచనతో సంస్థ ప్రతినిధులు దీనకొండ కృష్ణంరాజు, నారాయణరావు తమ శాంతి రథంలో ఈ మృతదేహాన్ని తరలించారు. రాజు వేగేశ్న ఫౌండేషన్ సహకారంతో సమకూర్చిన శాంతి రథాన్ని పేదలకు ఉచితంగా అందజేస్తామని ఈ సందర్భంగా కృష్ణంరాజు తెలిపారు. మృతదేహం వివరాల కోసం గాజువాక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

'ఆస్తుల అమ్మకాన్ని నిలిపివేయాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సమీపాన, నగరంలో ఉన్న ఆస్తుల అమ్మకం నిర్ణయాన్ని విరమించుకోవాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎండీ అతుల్ భట్‌కు లేఖ అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు నగరంలో, గాజువాకలోని ఆస్తులు భవిష్యత్తులో అవసరమన్నారు. అటువంటి భూమిని అమ్మాలనుకోవడం సరికాదన్నారు. కార్మిక సంఘాలతో ఎటువంటి చర్యలు జరపకుండా ఏకపక్షంగా తీసుకున్న ఆస్తుల అమ్మకాన్ని వెంటనే నిలుపుదల చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు.

అత్యవసర వేళ సంజీవనిలా.

అత్యవసర వేళ అందించే రక్తం సంజీవని వంటిదే. అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానం అంటారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి, శస్త్రచికిత్స సమయాల్లో రక్తం అత్యావశ్యకం. ఆ సమయంలో రక్తం అందుబాటులో లేక ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదు అనే సత్సంకల్పంతో స్టీల్‌ప్లాంట్ యువకార్మికుల చొరవతో ఆవిర్భవించిందే..ఉక్కు రక్తదాతల సంఘం (స్టీల్ ఎంప్లాయిస్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్- సెబ్డా). వీరు అందిస్తున్న రక్తం వేలాది మంది ప్రాణాలను నిలుపుతోంది.



సెబ్డా ఆవిర్భావంలో స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు

- వేలమందిని ఆదుకుంటున్న సెబ్డా'
- రోగులకు నేరుగా రక్తదానం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



రక్తదానం చేస్తున్న ఉక్కు ఉద్యోగి పోలీసు నాయుడు (ఫైల్ ఫొటో)

ఉక్కునగరం: సాటివారికి సాయం చేయడంలో ఎంతో తృప్తి ఉంటుంది. మనం ఇచ్చే రక్తం ఒక నిండు ప్రాణాన్ని నిలుపుతుంది అంటే అది అన్నింటినీ మించిన సాయమే అవుతుంది. అయితే, బ్లడ్‌బ్యాంకులు నిర్వహించడం, రక్తం నిల్వ ఉంచడం, అవసరమైన గ్రూప్ లేకపోతే రక్తదాతలను అన్వేషించడం కంటే కొంతమంది రక్తదాతలను ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా చేసి నేరుగా రక్తాన్ని దానం చేసేలా ప్రోత్సహిస్తే నగరానికి దూరంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ వంటి ప్రాంతాల వారికి అనువుగా ఉంటుందని భావించారు కొంతమంది యువ కార్మికులు. వారి కృషి ఫలితంగా ఏర్పడింది ఉక్కు రక్తదాతల సంఘం. కొమ్మోజు ఉమామహేశ్వరరావు (టీపీపీ), ఎం. సందీప్ (సీఈడీ), వై.అప్పారావు (డబ్ల్యుఎండీ), కె.వి.అప్పారావు (డబ్ల్యుఎండీ), డి. బాబూరావు (సీఈడీ), పోలీసు నాయుడు (బీఎఫ్), ఎం. గణేష్‌కుమార్ (వైర్ రాడ్ మిల్), వైకుంఠరావు (ఈఆర్ఎస్), రాజశేఖర్ (డబ్ల్యుఎండీ) 2012లో స్టీల్ ఎంప్లాయిస్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ (సెబ్డా)ను రిజిస్టర్ చేశారు.

వాట్సాప్.. ఫోన్ ద్వారానే...

సుమారు వెయ్యి మంది ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులతో వివిధ రక్త గ్రూపులతో కూడిన రక్తదాతలను సిద్ధం చేశారు. ఎటువంటి కార్యాలయం లేకుండానే కేవలం వాట్సాప్, మొబైల్ ఫోన్ల ద్వారానే అత్యవసర రోగుల పరిస్థితులకు అనుగుణంగా రక్తదాతలను పంపడం సెబ్డా ప్రత్యేకత.

ఉక్కు జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్ నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటంతో పాటు బయట బ్లడ్ బ్యాంక్‌ల నుంచి రక్తాన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రి యాజమాన్యం అంగీకరించని పరిస్థితులను చూసిన సంఘం ప్రతినిధులు ఉక్కు జనరల్ ఆస్పత్రి రోగులకు మొదటి ప్రాధాన్యతగా రక్తదాతలను పంపడం ప్రారంభించారు. ఈ విధంగా ఇప్పటి వరకు సుమారు 3 వేల మంది రోగులకు అవసరమైన దాతలను పంపి రక్తం అందజేశారు. కరోనా సమయంలో ప్లాస్మా కొరత ఉన్న రోగులకు ప్లాస్మా అందించి తమ వంతు సాయం అందించారు. ఇందుకోసం రోగుల నుంచి ఎటువంటి రుసుం వసూలు చేయటం లేదు.

బ్లడ్ బ్యాంకులతో అవగాహన

నగరంలోని పలు బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు తగ్గినప్పుడు వారికి అవసరమైన గ్రూప్ రక్తానికి సంబంధించిన దాతలను పంపిస్తుంటారు. అదే విధంగా అత్యవసర పరిస్థితుల్లో సెబ్డా వద్ద అవసరమైన రక్తం లేనప్పుడు ఆయా బ్లడ్ బ్యాంక్‌ల నుంచి తీసుకునేలా అవగాహన కుదుర్చుకున్నారు. నగరంలోని యువతతో ఏర్పడిన 'జనరేషన్ యువ' తో ఉన్న అవగాహన మేరకు అవసరమైనప్పుడు రక్తదాతలను పంపుతుంటారు.

రక్తం అవసరమైన వారు రక్తదాతల కోసం సెబ్డా ప్రతినిధులు ఎం.సందీప్ (90322 11188), కె. ఉమామహేశ్వరరావు (98855 61161)లను సంప్రదించవచ్చు.

ఆపదలో ఉన్నవారికి రక్తం అందిస్తున్నాం



ఆపదలో ఉన్నవారికి రక్తం అందుబాటులో ఉంచాలనేదే సెబ్డా ధ్యేయం. రక్తం లేకపోవడం వల్ల వ్యక్తి ప్రాణాలకే ముప్పు వచ్చిందనే పరిస్థితి రాకుండా చూడటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. ఇందులో భాగంగా రక్తదాతల సంఖ్య పెంచడానికి కృషి చేస్తున్నాం.

– ఎం. సందీప్, సెబ్డా కన్వీనర్

21 సార్లు రక్తదానం



బ్లడ్ క్యాంప్‌లను నిర్వహించడం ద్వారా బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వ ఉంచడం కాకుండా అవసరమైనప్పుడు రక్తదాతలను ఏర్పాటు చేస్తున్నాం. నేను 2015 నుంచి ఇప్పటికి 21 సార్లు రక్తదానం చేశాను. మూడు సార్లు ప్లాస్మా దానం చేశాను. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదాతలు మరింత మంది ముందుకు రావాలి.

– బి. వైకుంఠరావు, సెబ్డా వర్కింగ్ ప్రెసిడెంట్

సమస్యలను సత్వరం పరిష్కరిస్తాం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- 65, 74 వార్డుల్లో పర్యటన



74వ వార్డు దయాల్‌నగర్‌లో ఛిద్రమైన రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

పెదగంట్యాడ: గ్రేటర్ విశాఖ పరిధిలోని సమస్యలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. జీవీఎంసీ 6వ జోన్ పరిధిలోని 65, 74 వార్డుల్లో ఆయా వార్డు కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, తిప్పల వంశీరెడ్డితో కలసి ఆయన మంగళవారం పర్యటించారు. 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్ రాజీవ్ స్టేడియంతో పాటు రాజరాజేశ్వరి ఓపెన్ ఆడిటోరియం, స్విమ్మింగ్ పూల్ మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. వికాస్‌నగర్‌లోని పార్కుతో పాటు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనాన్ని ఆధునికీకరిస్తామన్నారు. వాంబే కాలనీలో కాల్వల మరమ్మతులు చేపడతామని చెప్పారు. వికాస్‌నగర్ గెడ్డ సమస్యను కార్పొరేటర్ వివరించగా టెండర్లు పిలిచామని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. వార్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న యూజీడీ పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి

74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సచివాలయ శానిటరీ కార్యదర్శులు వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. దయాల్‌నగర్‌లోని పైపులైన్లు నిత్యం దెబ్బ తింటున్నాయని, యూజీడీ గోతులు పూడ్చాలని, వీధి దీపాలు వెలిగించాలని కార్పొరేటర్ వంశీరెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీసీ రోడ్డు మార్జిన్‌లో అధికంగా భవన నిర్మాణ వ్యర్థాలు ఉన్నాయని, వాటిని తొలగించి కంచె ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, జోనల్ కమిషనర్ సింహాచలం, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వర్ణ పతక విజేతకు సత్కారం



దుర్గా స్ఫూర్తి శ్రీని సత్కరిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఏషియన్ చెస్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన సత్తి దుర్గా స్ఫూర్తి శ్రీని రాఘవరెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ స్ఫూర్తి శ్రీలో అసాధారణ ప్రతిభ ఉందన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కూడా సత్తా చాటిందన్నారు. ఈ పోటీలలో బంగారు పతకం సాధించడంతో పాటు బెస్ట్ బాక్సర్‌గా నిలిచిందన్నారు. క్రీడల్లో రాణిస్తున్న ఆ బాలికను, ఆమె తల్లిదండ్రులు సత్యనారాయణరెడ్డి, నాగలక్ష్మిలను సత్కరించారు. కార్యక్రమంలో జాగారపు శ్రీను, కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, తమలంపూడి వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారు ఏర్పాటుకు వినతి



మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: అగనంపూడిలో రైతు బజారు ఏర్పాటు చేయాలని కోరుతూ అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల ప్రతినిధులు విశాఖ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బి.ఎస్.కృష్ణకు వినతిపత్రం అందించారు. గోపాలపట్నంలోని మార్కెటింగ్ కార్యాలయంలో ఆయన్ను కలిసిన నాయకులు 79, 85 వార్డుల్లో 26 ఉక్కు నిర్వాసిత కాలనీలు, ఆరు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలు, కొత్తగా వెలసిన అపార్టుమెంట్లు, కాలనీల్లో సుమారు 40వేల మంది వరకు జనాభా నివాసముంటున్నారని తెలిపారు. స్థానికంగా మార్కెట్ అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతు బజార్ ఏర్పాటుకు గతంలో ఇచ్చిన హామీ మేరకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కొలిపాక అప్పారావు, ఇరోతి గణేష్, యలమంచిలి అప్పారావు, బి.అప్పారావు, వై.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై తక్షణం స్పందించాలి



సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడుతున్న దువ్వాడ సీఐ శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: మహిళలు ఎదుర్కొనే సమస్యలపై సత్వరమే స్పందించాలని దువ్వాడ లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సచివాలయ మహిళా పోలీసులకు శాంతి భద్రతల పరిరక్షణపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. మహిళల సంరక్షణ కోసం ఏర్పడిన చట్టాలపై అవగాహన ఏర్పరచుకుని, ముందస్తు సమాచారాన్ని సేకరించడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చన్నారు. ఎటువంటి సమాచారం అందినా వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు.

ప్రతీ విద్యార్థికి జగనన్న విద్యా కానుక

పాఠశాలల్లో పండగ వాతావరణం

అగనంపూడి: ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్కరూ బడికి దూరం కాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నారని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. వార్డులోని ఫార్మాసిటీ కాలనీ లేమర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆమె జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, హెచ్‌ఎం అమ్మాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జేవీకే కిట్ల పంపిణీ కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, నాయకులు అప్పారావు, కర్రి నరసింగరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు జగనన్న భరోసా

అక్కిరెడ్డిపాలెం: పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు అన్ని వసతులు కల్పిస్తూ వారి భవిష్యత్తుకు సీఎం జగన్ భరోసా కల్పిస్తున్నారని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు.



లంకెలపాలెం హైస్కూల్‌లో జేవీకే కిట్లు అందుకున్న విద్యార్థులతో నాయకులు



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు జేవీకే కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ అనూష, లతీష్

కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, పాఠశాల కమిటీ చైర్మన్ వై.సత్యారావు, వైస్ చైర్మన్ రోషిణి, సంగ్రాన నూకరాజు, మానిటరింగ్ కమిటీ మెంబర్ బోనెల జోసెఫ్ పాల్గొన్నారు.

నడుపూరు పాఠశాలలో..

పెదగంట్యాడ: 76వ వార్డు నడుపూరు ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మంగళవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం రత్నం, వైఎస్సార్ సీపీ నాయకుడు మంత్రి శంకరనారాయణ, ఎం.అచ్చింనాయుడు, తాటికొండ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



లేమర్తి హైస్కూల్‌లో కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి



76వ వార్డులో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కళాశాలలో 'నారాయణ అండ్ కో' సందడి

విద్యార్థులతో చిట్‌చాట్

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నారాయణ అండ్ కో చిత్ర యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా కళాశాలను సందర్శించి, అక్కడి విద్యార్థులతో చిట్‌చాట్ చేశారు. చిత్ర కథానాయకుడు సుధాకర్ కాముకల, కథానాయిక ఆర్తి, దర్శకుడు చిన్న పాపిశెట్టి, నటి ఆమని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా చిత్రాన్ని రూపొందించామన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న చిత్ర దర్శకుడు చిన్న పాపిశెట్టి

ఉక్కు అమరవీరులకు నివాళులు



సీ భవన్‌లో రక్తదానంలో పాల్గొన్న డైరెక్టర్ బాగ్చీ, సీజీఎంలు, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–2లో 2012లో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 19 మంది ఉద్యోగులకు సీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చీ నివాళులర్పించారు. సీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 145 యూనిట్లు రక్తం సేకరించారు. కార్యక్రమాల్లో భాగంగా ఈ ఆధ్వర్యంలో నాలుగు దివ్యాంగ, అనాథాశ్రమాల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ సీజీఎం శాంతకుమార్, సీజీఎం వర్క్స్ మహంతి, సీజీఎంలు సారంగి, జి. గాంధీ, జీఎం. కె. సంజీవరావు సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, ఉపాధ్యక్షులు చంద్ర వెంకట్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో..

స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉక్కు పొట్టి శ్రీరాములు కూడలి వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తులో అటువంటి ప్రమాదం జరగకుండా యాజమాన్యం ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వై. మస్తానప్ప, గొందేశి వెంకట రమణారెడ్డి, మార్టుపూడి పరదేశి, కర్రి దాలినాయుడు,పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ సెంటర్ వద్ద ఉన్న మృతవీరుల స్థూపం వద్ద నాయకులు, కార్యకర్తలు పూలతో అంజలి ఘటించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. ఆదినారాయణ, అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'హామీలను విస్మరించి రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలా?'

అగనంపూడి: విభజన హామీలను విస్మరించి, పదేళ్లలో రాష్ట్ర ప్రజలకు కేంద్రప్రభుత్వం ఏం చేసిందో చెప్పే ధైర్యం లేని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రభుత్వంపై ఇష్టానుసారం మాట్లాడితే ప్రజలు తిరుగుబాటు చేస్తారని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ అన్నారు. అగనంపూడిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలను విస్మరించిన మీరు ముందుగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. లక్షల కోట్లతో ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేయడం బీజేపీ నాయకుల దుర్నీతికి నిదర్శనమన్నారు.


నెల్లిముక్కు రామాలయాన్ని సందర్శించిన టీటీడీ సర్వేయర్



సీతారాములను దర్శించుకుంటున్న సర్వేయర్ సత్యనారాయణ

పెదగంట్యాడ: తిరుమల తిరుపతి దేవస్థానం సర్వేయర్ సత్యనారాయణ నెల్లిముక్కు రామాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఆలయంలో ఉపాలయాల నిర్మాణ విషయమై ఆలయ కమిటీ ప్రతినిధులు గతంలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన ఆదేశాలతో సర్వేయర్ ఆలయాన్ని సందర్శించారు. స్థానిక నాయకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో వినాయకుడు, సరస్వతీ దేవి, సూర్యనారాయణ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ గురించి చర్చించారు. కార్యక్రమంలో గొందేశి మహేశ్వర రెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, నీలాపు తిరుమల రెడ్డి, సింహాచలం, సుమన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో బొప్పాయి మొక్కల పెంపకం



మొక్క నాటి, నీరు పోస్తున్న సీజీఎం గాంధీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆగ్రో ఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బొప్పాయి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉక్కునగరంలోని ఎకరం భూమిలో వెయ్యి మొక్కలు నాటడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బొప్పాయి మొక్కలను నాటడం ద్వారా ఆదాయ ఉత్పత్తికి సరికొత్త చొరవను చేపట్టడం అభినందనీయమన్నారు. పచ్చదనాన్ని కాపాడుతూ ఖాళీగా ఉన్న భూమిని సద్వినియోగం చేసుకున్నందుకు ఆగ్రోఫారెస్ట్ విభాగం సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో టౌన్ అడ్మిన్ సీజీఎం చంద్రశేఖర్, విభాగాధిపతి వి.ఆర్.పి. లాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లకు జీవీఎంసీ కార్మికుల వినతిపత్రాలు

గాజువాక : జీవీఎంసీలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కార్పొరేటర్లకు మంగళవారం వినతి పత్రాలను అందజేశారు. కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి, దల్లి గోవిందరెడ్డి, మహ్మద్ ఇమ్రాన్, గంధం శ్రీనులను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ప్రజారోగ్యం, నీటి సరఫరా, యూజీడీ, క్లాప్ ఆటో, వెటర్నరీ విభాగాలకు చెందిన కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఆ సమస్యల పరిష్కారం కోసం తాము ఈ నెల 19 నుంచి సమ్మెకు దిగుతున్నామన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు గొలగాని అప్పారావు, గొల్ల రాము, నాగరాజు, మీనాక్షి, గణేష్ తదితరులున్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

అక్కిరెడ్డిపాలెం: డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరుతూ వైద్య సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీ, 69వ వార్డు రెడ్డితుంగ్లాంలలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. శానిటరీ సూపర్‌వైజర్ రామారావు, 69వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వమ్మి అమర్‌నాథ్, మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువకుని మృతి కేసులో చురుగ్గా దర్యాప్తు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు కాళికానగర్ మింది పంప్ హౌస్ సమీపంలోని కాలువలో లభించిన యువకుడి మృతదేహం కేసులో చురుగ్గా దర్యాప్తు చేస్తున్నామని, ఇప్పటి వరకు పురోగతి కనిపించలేదని గాజువాక పోలీసులు తెలిపారు. ఆదివారం సాయంత్రం లభించిన మృతదేహం దల్లి శివదిగా నిర్ధారించిన పోలీసులు ఆ స్థలంలో సోమవారం క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. స్థానికులను విచారించి వివరాలు సేకరించారు. మృతుని స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులతోపాటు శివ ప్రేయసి, ఆమె కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల వారిని విచారించి, వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. శివ ప్రమాదవశాత్తూ చనిపోయాడా..?, ఎవరైనా హతమార్చారా..? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా కేసు ఛేదించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు, ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపారు.

'ఉక్కు' ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం



దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలే కీలకమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో మాత్రమే కార్మికులకు వేతనాలు సరిగ్గా అమలవుతున్నాయని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేస్తే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద మంగళవారం 852వ రోజు రిలే నిరాహార దీక్షలో సంస్థలోని ట్రాఫిక్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, ప్లాంట్‌కు భూములు ఇచ్చిన నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కుట్రలను ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామన్నారు. నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.